రక్షణ గ్రిల్స్‌కే రక్షణ కరువు




ఆరిలోవ యూపీహెచ్‌సీ సమీప గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు

- గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఫెన్సింగ్ రాడ్ల చోరీ
- గుర్తు తెలియని వ్యక్తుల చేతివాటం
- ఇనుప రాడ్లు మాయమవడంతో ఖంగుతున్న అధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ అధికారులు పచ్చదనం సంరక్షణలో భాగంగా గెడ్డలు, రోడ్ల పక్కన కొన్నాళ్లుగా కంచె నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ మీదుగా ముడసర్లోవ వెనుక రోడ్లలో ఆరిలోవ యూపీహెచ్‌సీ సమీపంలో కంబాలకొండ, రోడ్లకు మధ్య గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టారు. ఇక్కడ రోడ్డు పక్కన ఇటీవల కంచె నిర్మాణం కోసం గ్రిల్స్ ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. ఇటీవల రోడ్డు పక్కన ప్రతి ఐదు అడుగుల దూరానికి ఒకటి చొప్పున ఇనుప రాడ్లు పాతారు. అక్కడ గోతుల్లో కాంక్రీట్ వేసి వాటిని అమర్చారు. ఆ రాడ్లకు ఇనుప తీగలు చుట్టాల్సి ఉంది. ఇంతలో ఆ రాడ్లు మాయమయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రాడ్లను దొంగలించారు. కాంక్రీట్ నుంచి వాటిని తొలగించి పట్టుకుపోయారు. దీంతో రెండు రోజుల కిందట గ్రిల్స్ వేయించడానికి వెళ్లిన జీవీఎంసీ సిబ్బంది ఖంగుతిన్నారు. ఇక్కడ ఖాళీగా ఉన్న జీవీఎంసీ స్థలాన్ని కొందరు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని, వారే తొలగించి ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



ఇనుప రాడ్లు దొంగలించిన తర్వాత మిగిలిన సిమెంట్ దిమ్మలు

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.18.36 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న శివజ్యోతి తదితరులు

సీతమ్మధార : ఆశీలమెట్టలోని శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు శనివారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 28 రోజులకు గాను రూ.18.36 లక్షలు, 3 గ్రాముల 320 మిల్లీగ్రాముల బంగారం, 143 గ్రాముల 400 మిల్లీగ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన 228 డాలర్లు, 551 ఖతార్ రియాన్స్, 3 మలేషియా రింగిట్స్ వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, శివజ్యోతి, శ్రీవేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవిందరెడ్డి, డి.ఎస్.ప్రసాద్, భక్తులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కళాభారతిలో సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

మద్దిలపాలెం: మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్రుడు నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ప్రతి ఏడాది నిర్వహించే వార్షికోత్సవంలో భాగంగా ఈ ప్రదర్శన ఇస్తున్నామని నిర్వాహకుడు వంకాయల మారుతీ ప్రసాద్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నాటకం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం హరిశ్చంద్రుడు పాత్రదారి ఎం.ఎస్.నాయుడు, చంద్రమతి పాత్రదారి గౌరిశ్వరిలను సత్కరించనున్నామని చెప్పారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న కృష్ణా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తదితరులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.సుజాత శనివారం ఉచితంగా పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నోట్ పుస్తకాలు, పాఠ్యాంశాల పుస్తకాలు అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, లైబ్రేరియన్ రాజశేఖర్ రెడ్డి, జేఆర్.నాయుడు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు 'ఆనంద్‌మార్గ్' సాయం

ఆరిలోవ: కేరళలో ఇటీవల సంభవించిన తుపాను కారణంగా నష్టపోయిన వరద బాధితులకు ఆనంద్‌మార్గ్ వర్సిటీ రిలీఫ్ బృందం, విశాఖ యూనిట్ సహాయం అందించడానికి సిద్ధమైంది. జీవీఎంసీ 10వ వార్డు డెయిరీ ఫారం వద్ద ఇందిరానగర్‌లో ఆశ్రమం నుంచి ఆనంద్ మార్గ్ వర్సిటీ రిలీఫ్ బృందం శనివారం బయలుదేరినట్లు ఆశ్రమ స్వామీజీ సామ్యాంద అవదూత తెలిపారు. వరద బాధితుల కోసం 500 తువ్వాళ్లు, 500 దుప్పట్లు, దుస్తులు, అత్యవసర సామగ్రి తీసుకొని ఆచార్య ఇష్ట ప్రేమానంద్ అవదూత బయటుదేరి వెళ్లినట్లు చెప్పారు.

హెర్నియా సమస్యకు రోబోటిక్ సర్జరీ



సదస్సు ప్రారంభిస్తున్న ఏసీపీ వివేకానంద

ఎంవీపీకాలనీ: స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో శనివారం హెర్నియా అప్డేట్స్–2024 పేరిట ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజుల ఈ సదస్సును ముఖ్య అతిథి విశాఖ దిశ ఏసీపీ సిహెచ్.వివేకానంద జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతికతను వైద్యులందరూ అందిపుచ్చుకుని రోగులకు విలువైన సేవలు అందించాలని సూచించారు. చీఫ్ కన్సల్టెంట్ జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ హెర్నియా సమస్యకు రోబోటిక్ టెక్నాలజీతో సులభతరంగా సర్జరీ చేసే విధానం అందుబాటులో ఉందన్నారు. శస్త్రచికిత్స విధానాన్ని ప్రయోగాత్మకంగా వైద్యులకు వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 300 మంది సర్జన్స్, మెడికవర్ రీజనల్ డైరెక్టర్ ఎస్.పద్మజ, వైద్యులు డాక్టర్ బి.బి.దాస్, జె.సి.నాయుడు, శివశంకర్, పి.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ వేళల్లో స్వల్ప మార్పు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో ప్రతీరోజు బయల్దేరే విశాఖపట్నం–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్ వేళలు పలాసలో స్వల్పంగా మారినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైలు ఆగస్టు 15వ తేదీ నుంచి పలాస స్టేషన్‌కు రాత్రి 6.43 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 6.48 గంటలకు బయల్దేరుతుంది.

9 నుంచి ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలు



వారోత్సవాల గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ : ప్రపంచ ఆదివాసీ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వివరాలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ శనివారం ఎంవీపీ కాలనీ గిరిజన భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ముందుగా వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 15 వరకు వారోత్సవాలు ఎంవీపీ కాలనీ గిరిజన భవన్ వేదికగా నిర్వహిస్తామని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా, హక్కుల సాధన పరంగా గిరిజనులు సమాజంలో వెనుకబడి ఉన్నారన్నారు. ఆయా రంగాల్లో గిరిజనులను చైతన్యవంతులను చేయడమే వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ దిశగా ఆయా రంగాల్లో సాధించాల్సిన పురోగతిపై చర్చించనున్నట్లు తెలిపారు. దీంతోపాటు గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల ప్రదర్శనకు వారోత్సవాలు వేదికగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కాలేజీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: జూనియర్ కాలేజీల్లో ఆదివారం తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారామ్ తెలిపారు. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేజీలు తెరువకూడదన్నారు. నగరంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు.

ఈ ఆదివారం బాలల హక్కుల కమిషన్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం, అదే విధంగా రెండో శనివారం విద్యార్థులను కాలేజీలకు పిలిపించినట్లయితే, అలాంటి కాలేజీల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. సెలవు రోజైన ఆదివారం కాలేజీలు నిర్వహించడానికి వీల్లేదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.మురళీధర్ హెచ్చరించారు.

ముడసర్లోవ రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాలు



ముడసర్లోవ రోడ్డు పక్కన పడేసిన కవర్లు

ఆరిలోవ : ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లన్నీ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఓ పక్క నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి లారీలతో తీసుకొచ్చిన గృహ వ్యర్థాలను ఈ రోడ్లపై గుట్టలుగా వేసేస్తున్నారు. మరో వైపు చికెన్ షాపుల నుంచి కోళ్ల వ్యర్థాలను పెద్ద సైజు ప్లాస్టిక్ సంచులతో కొందరు ఇక్కడకు తీసుకొచ్చి... ఆ వ్యర్థాలను వ్యానులలో ఖాళీ సింథటిక్ డ్రమ్ములలో వేసుకొని పాలిథిన్ కవర్లను మాత్రం రోడ్డుపై గుట్టలుగా వేసేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా కలుషితమవుతోంది. నగరంలో చికెన్ షాపుల నుంచి రోజూ కోళ్ల వ్యర్థాలను కొందరు వ్యాపారులు సేకరిస్తున్నారు. నిజానికి ఆ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించడానికి జీవీఎంసీ అధికారుల నుంచి కాంట్రాక్ట్ తీసుకుంటున్నారు. అయితే కొందరు అనధికారికంగా ఈ వ్యాపారం చేస్తున్నారు. కానీ ఆ వ్యాపారులు జీవీఎంసీ అధికారులను బురిడీ కొట్టించి గుట్టుగా పెద్ద పాలిథిన్ కవర్లలో కోళ్ల వ్యర్థాలను మూటలు కట్టి వ్యానులలో నిర్మానుష్యంగా ఉండే ముడసర్లోవ ప్రాంతానికి రాత్రి వేళ తీసుకొస్తున్నారు. అక్కడ ఆ కోళ్ల వ్యర్థాలను ఖాళీ సింథటిక్ డ్రమ్ములలో వేసి వాసన రాకుండా రసాయనాలు చల్లుతున్నారు. ఆ పాలిథిన్ కవర్లను మాత్రం రోడ్డు పక్కన గుట్టలుగా వేసేస్తున్నారు. ఆ మాంసం వ్యర్థాలను గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో చేపల చెరువుల నిర్వాహకులకు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ రోడ్లలో వేసిన పాలిథిన్ కవర్లతో వాతావరణం కలుషితమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చని చెట్ల మధ్య ఈ పాలిథిన్ సంచులు, వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏయూ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తామని ఏయూ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ వెల్లడించింది. ఏయూలో శనివారం కౌన్సిల్ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యచరణపై కార్యవర్గ సభ్యులు చర్చించారు. వీటితోపాటు వారి సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చించాలని నిర్ణయించారు. వర్సిటీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలని కోరుతూ ఏయూ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేయడంతోపాటు ఉద్యోగులకు మంచి జరిగేలా యూనియన్‌ను ఎన్నుకునేలా ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు బి.దేముడు, టి.సాయిబలరాం, పి.అమరేంద్ర, నూకరాజు, డొక్కర శ్రీను, అవాల రమేష్, చిరంజీవి, మూర్తి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్ట్ నేతలు

మహారాణిపేట : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ల ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులందరికీ రూ. 1250 మెడీ క్లెయిమ్ చెల్లించాలని, జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరోతి ఈశ్వరరావు, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు


కార్పొరేట్ శక్తుల నుంచి రక్షించుకుంటేనే విశాఖ మనుగడ



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార : కార్పొరేట్ శక్తుల నుంచి విశాఖ జిల్లా ప్రజలను, పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ఉద్యమాలకు ఇక్కడి ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కొత్తపల్లి లోకనాథం పిలుపునిచ్చారు. భీమిలి ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలకు, కుసులువాడ మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా చేపట్టారు. దీనికి సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ విశాఖను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని గత ఇరవై ఏళ్లుగా పాలకులు చెబుతున్నా వాస్తవానికి అభివృద్ధి ముసుగులో కార్పొరేట్ శక్తులతో మైనింగ్, భూదందా వ్యాపారాలు జరుగుతున్నాయన్నారు. విశాఖ బీచ్ సీఆర్ జెడ్ జోన్‌లో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వాలు, అధికారులు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఆనందపురం, కుసులువాడ ప్రాంతాల్లో గ్రావెల్, మైనింగ్ వంటి వాటికి కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ, అటవీ రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతులివ్వడాన్ని తప్పు పట్టారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వాల్లాగే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజా తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ, ఆర్‌ఎస్ఎన్ మూర్తి, బి.రమణి, నరేంద్రకుమార్, సుబ్బారావు, పి.మణి, రాజు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన వారితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో నలుగురు మునిగిపోతుండగా లైఫ్‌గార్డ్స్ ప్రాణాలు కాపాడారు. విజయనగరం జిల్లా గరివిడి ప్రాంతానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన 15 మంది శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు చేరుకున్నారు. బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో తోలాడ గొల్లబాబు, కళ్యాణ కీర్తన, శోభ, కరిశెట్టి శాంతి కుమారి మునిగిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ సతీష్, నూకరాజు, ఎం.చందు, డి.కార్తీక్, ఎం.అమ్మోరు, కె.రాజు వీరిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకుని వచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.34.80 లక్షలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. గత నెల 12 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు రూ.34,80,944 నగదు, 115.5 గ్రాముల బంగారం, 610.5 గ్రాముల వెండితో పాటు అమెరికాకు చెందిన 247 డాలర్లు, మలేషియా దేశానికి చెందిన ఆర్‌ఎమ్ 11 రింగిట్స్, ఖతర్‌కు చెందిన 1 రియాల్, కువైట్‌కు చెందిన 1/4 దినార్ వచ్చాయి. మరోవైపు దేవస్థానంలో ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసుల రెడ్డి, సహాయ కార్యహణాధికారి వి.రాంబాబు తెలిపారు.

ఫ్రెండ్‌తో జిందగీ బిందాస్

స్నేహానికన్న మిన్న లోకాన లేదురా.. స్నేహం గురించి గొప్పగా ఇంతకంటే ఎలా చెప్పగలం. కాలం మారుతున్నా.. స్నేహం మారదనడానికి ఎన్నో స్నేహగీతాలే నిదర్శనం. స్నేహ బంధం ఎంతో గొప్పది. దీనికి కుల, మత, వర్ణ, వర్గ బేధాలు లేవు. ఈ లక్షణమే అందిరినీ స్నేహితులుగా కలుపుతుంది. ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా గ్రాండ్‌గా వేడుకలు జరుపుకునేందుకు మిత్రులంతా సిద్ధమయ్యారు.

– మద్దిలపాలెం/బీచ్‌రోడ్డు

మా ఇద్దరి ఆలోచనలు ఒక్కటే



మనలాగే ఆలోచించే వారు మనకు ఎదురు కావడం చాలా అరుదు. అలా నాలుగేళ్ల కిందట నా నేస్తం స్వాతి నాకు ఎదురైంది. మా ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉంటాయి. అటువంటి ఫ్రెండ్ తోడుగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను. శ్వాస ఉన్నంత వరకు మా స్నేహం నిలిచే ఉంటుంది.

– స్నేహితిరాలు స్వాతితో డాక్టర్ యశోద

ఎన్నటికీ విడిపోనిది స్నేహబంధం



76 ఏళ్ల వయసులోనూ మా స్నేహితులందరం కలుసుకుని చిన్నపిల్లల్లా సరదాగా గడుపుతున్నాం. ఇదే ఆరోగ్యకరమైన ఎప్పటికీ నిలిచి ఉండాల్సిన స్నేహబంధం. స్నేహానికి ప్రతిరూపం శ్రీకృష్ణ పరమాత్మ–కుచేలుడు. అంతటి వాళ్లం కాకపోయినా ఆనందంగా ఉండే మా స్నేహబంధం అంత గొప్పదని మాత్రం చెప్పగలం. నా స్నేహితుడు ద్వారకా విశ్వనాథ శాస్త్రి హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా స్నేహితుల దినోత్సవం రోజున నన్ను వచ్చి కలవడం ఎంతో సంతోషంగా ఉంది. మేమిద్దరం పాత విషయాలన్నీ తలుచుకుంటూ ఉంటే ఆ ఆనందానికి అవధులు లేవు. మాతోపాటే మరో స్నేహితుడు అచ్యుత రామారావు ఎంఏ బీఈడీ చేసి మండల ఎడ్యుకేషన్ అధికారిగా పదవీ విరమణ చేశాడు. మన ఆనందంలో.. కష్టాల్లో అండగా ఉండేది స్నేహితులు మాత్రమే. జీవితంలో ప్రతి ఒక్కరూ కనీసం ఇద్దరు ముగ్గురు నైనా అటువంటి వారిని సంపాదించుకోవాలి.

– బాల్య స్నేహితుడు విశ్వనాథ శాస్త్రితో డాక్టర్ గుమ్ములూరి రాంబాబు (కళాభారతి కార్యదర్శి)

అధ్వానంగా త్రీటౌన్ పోలీస్ స్టేషన్



సీఐ గది పక్కన వ్యర్థాలు



ద్వారక ఏసీపీ కార్యాలయం పక్కన చెత్త



క్రైం అండ్ ట్రాఫిక్ విభాగం సమీపంలో చెత్త

- పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు
- సీపీ ఆగ్రహం వ్యక్తం చేసినా మారని తీరు

బీచ్‌రోడ్డు: త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పరిసరాల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. పోలీస్ స్టేషన్ ప్రవేశ ద్వారం నుంచి సీఐ గది పక్క స్థలం వరకూ పారిశుధ్యం అధ్వానంగా దర్శనమిస్తోంది. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోనే ద్వారకా జోన్ ఏసీపీ కార్యాలయం, ఎంవీపీ క్రైమ్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూడా వున్నాయి. ఇంత మంది ఉన్నతాధికారులు వుంటున్న పరిసరాల్లో ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. వాటర్ బాటిళ్లు, భోజనాలు, టిఫిన్ పార్శిళ్లకు సంబంధించిన చెత్త పేరుకుపోయింది. ఈ పరిస్థితిని చూసి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆగ్రహం వ్యక్తం చేసినా పరిస్థితిలో మార్పు రాకపోవడం శోచనీయం. సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బాగ్చి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అధ్వానంగా వున్న పరిసరాలను చూసి వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. అయినప్పటికీ సిబ్బంది తీరులో మార్పు రాలేదు. ఎప్పటిలాగే స్టేషన్ పరిసరాలు చెత్తతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సిబ్బంది స్పందించి పరిసరాలు పరిశుభ్రంగా వుంచేందుకు చర్యలు చేపట్టాలని పలువురు ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

వేగవంతంగా 'ప్రసాద్' పథకం పనులు



పనులను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. ఈ పనులను శనివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, టూరిజం, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలిచారు. కొండదిగువ పుష్కరిణిసత్రం, కల్యాణమండపం, ఘాట్‌రోడ్డులో వైజంక్షన్, క్యూకాంప్లెక్స్, యాంపీ థియేటర్, అన్నప్రసాద వితరణ భవనంలో కోల్డ్ స్టోరేజీ పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఆయా పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను సింహగిరిపై ఆనంద నిలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ఈఈ రమణ, దేవస్థానం ఈఈలు, ఏఈ పాల్గొన్నారు. అంతకు ముందు స్వామిని కమిషనర్ సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు.